## క్లుప్తంగా

### ఉపాధి పనులు నిలిపివేయడం అన్యాయం

**కర్నూలు(సెంట్రల్):** ఆదోని మండలంలో రాజకీయ కారణాలతో ఉపాధి హామీ పనులను నిలిపి వేయడం అన్యాయమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, కార్యదర్శి కేవీ నారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చిన తరువాతే ఉపాధి పనులు చేపట్టాలని అధికారులపై ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తీసుకురావడం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయ కారణాలతో పనులు నిలిచిపోతే మండలంలోని 44 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడతారని, జిల్లా కలెక్టర్ కలగజేసుకొని పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్

**కర్నూలు (టౌన్) :** క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ అన్నారు. శనివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో బి. క్యాంపు క్రీడా క్లబ్ క్రీడాకారులకు ఆయన టీషర్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. తద్వారా ఒత్తిడిని అధిగమించి వచ్చాన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాల్ విజయకుమార్, లక్ష్య ఫుట్‌బాల్ కోచ్ బ్రహ్మకుమార్, నవాజ్, విజయ్, శ్రీధర్, రంగడు పాల్గొన్నారు.

### పాణ్యం ఎమ్మెల్యేకు సత్కారం



పాణ్యం ఎమ్మెల్యే గౌరు దంపతులను సత్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

**కర్నూలు(అగ్రికల్చర్):** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం అసెంబ్లీ నియోజక వర్గం నుంచి శాసనసభ్యురాలుగా ఎన్నికైన గౌరు చరితను ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలు అభినందించారు. ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్, నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న తదితరులు నగరంలోని నివాసానికి వెళ్లి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, నగరశాఖ కార్యదర్శి రామకృష్ణ, మాజీ జిల్లా అధ్యక్షుడు క్రిష్టఫర్ దేవకుమార్, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్‌రావు, నాన్ గెజిటెడ్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా నేతలు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సాయిరాం, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### డైరెక్టర్ పదవికి రాజీనామా

**కల్లూరు:** వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ నాయకులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి రుణపడి ఉంటానని తెలిపారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**కర్నూలు సిటీ:** నూతనంగా ఏర్పాటవుతున్న ప్రభుత్వం విద్యా రంగ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ కోరారు. శనివారం కార్మిక, కర్షక భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టనున్న నూతన ప్రభుత్వానికి తమ సంఘం తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు. విద్యా వ్యవస్థలో మార్పుల పేరుతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ఎం.ఎస్ నంబరు 117ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు నూతన పీఆర్‌సీ ప్రకటించాలని, విద్యా రంగంలో నెలకొన్న అనేక సమస్యలపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎల్లప్ప, జయరాజు, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యోహోషువ, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, దుర్గా ప్రసాద్, ఖాసీం, గాదిలింగప్ప, శ్రీనివాసులు, నరసింహ, భాస్కర్, సోమన్న పాల్గొన్నారు.

### ఆరుద్రోత్సవ పూజలు

**మహానంది:** మహానంది, ఓంకారం ఆలయాల్లో శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి, ఓంకార సిద్దేశ్వరస్వామి వార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు నిర్వహించుకున్నారు.

# వానొస్తే ఇంతే..

నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇటీవలే రహదారి విస్తరణలో భాగంగా చౌరస్తాలోని ఫ్లై ఓవర్ కింద డివైడర్ల వెడల్పు తగ్గించే పనులు చేపట్టారు. రెండుమూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో అక్కడ నీరు నిలిచి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పాతబస్టాండ్‌కు వెళ్లే దారిలోని గోశాల దగ్గర కూడా ఇదే పరిస్థితి నెలకొంది. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పెద్దపార్కు సమీపంలో గోశాల వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు







బళ్లారి చౌరస్తాలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద తవ్విన గుంతలో నిలిచిన వర్షపు నీరు, ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిలిచిపోయిన వాహనాలు

## సకాలంలో టీకాలు వేయాలి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ

**కర్నూలు(హాస్పిటల్):** గర్భిణులు, చిన్నపిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న టైపిస్ట్ కాలనీ సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఏఎన్ఎంలు తమ పరిధిలో అర్హులైన గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎంఆర్-1,ఎంఆర్-2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఏఎన్ఎం యాప్, హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఎ.క్యాంపులోని మెరిడియన్ ఫంక్షన్ హాలు వద్ద ఉన్న యూపీహెచ్‌సీని తనిఖీ చేసి వ్యాక్సిన్‌లు నిల్వ ఉంచే శీతలీకరణ యంత్రాలను, వ్యాక్సిన్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

# వైద్య పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలి

- ల్యాబ్‌టెక్నీషియన్లతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సి. ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

**కర్నూలు(హాస్పిటల్):** సుదూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ల్యాబ్‌టెక్నీషియన్లకు ఆదేశించారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో మైక్రోబయాలజీ, పెథాలజీ, బయోకెమిస్ట్రీ, బ్లడ్‌బ్యాంకుల్లో పనిచేసే ల్యాబ్‌టెక్నీషియన్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ-హాస్పిటల్ డేటా ఎంట్రీ ప్రాసెస్ గురించి ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్లు ఎఫ్ఆర్ఎస్‌తో పాటు హాజరు రిజిస్టర్‌లో సిబ్బంది సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలోని సిబ్బంది సమయపాలన పాటించాలని, వారు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారన్న విషయాలపై రికార్డు నిర్వహించాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌కి ఇన్‌చార్జ్‌గా డాక్టర్ సునీల్ ప్రశాంత్‌ను నియమించినట్లు తెలిపారు. ఆయన ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తారన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్లకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్లు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. బయోకెమిస్ట్రీకి త్వరలో రెండు కంప్యూటర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

# సర్దుకుపోతేనే సాఫీగా సంసారం

- ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో దిశా మహిళా పీఎస్ డీఎస్పీ జె.బాబుప్రసాద్



కుటుంబ కలహాలతో వచ్చిన జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

**కర్నూలు:** భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుందని కర్నూలు దిశా మహిళా పీఎస్ డీఎస్పీ జె.బాబుప్రసాద్ అన్నారు. కుటుంబ కలహాలతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన ఆరు కుటుంబాలకు శనివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించగా రెండు కుటుంబాలు కలిసి కాపురం చేసేందుకు అంగీకరించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భార్యాభర్తల గొడవలు, కుటుంబ కలహాల పరిష్కారానికి దిశ ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో సమర్థవంతంగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పలు కీలక సూచనలు చేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటున్నామని, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతున్న నేపథ్యంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ చాలా ముఖ్యమైనదన్నారు. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల గొడవలకు చక్కటి పరిష్కారమార్గం చూపేందుకు అనుభవజ్ఞులైన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, అంకితభావంతో పనిచేయాలని, సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా చూడాలని సిబ్బందికి ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. కౌన్సెలింగ్ నిపుణులు రిటైర్డ్ లెక్చరర్ సత్యనారాయణ, న్యాయవాది కావేరి, సైకాలజిస్ట్ పెరుమాళ్ల లెనిన్ బాబు, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది మేరి, సునితలతో పాటు ఎన్‌జీఓస్ సిబ్బంది, సీఐలు, ఎస్ఐలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం

- నలుగురికి తీవ్రగాయాలు
- బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



కర్నూలు ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**వెల్దుర్తి(కృష్ణగిరి):** వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గొల్ల పెద్ద మాదన్న, మనోహర్, మోహన్‌కృష్ణ, చిన్న మాదన్నలపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శివ, అతని కార్యకర్తలు శుక్రవారం రాత్రి హత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి హుటాహుటిన గ్రామానికి చేరుకుని క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నాయకులు అల్లుగుండు శ్రీరాంరెడ్డి, గోపి తదితరులు ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ టీడీపీ వారి ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. పోలీసులు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా టీడీపీ నాయకుడు శివతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

**వీఆర్‌ఓపై దాడి**

వెల్దుర్తి వీఆర్‌ఓ ప్రసాద్‌పై టీడీపీ నాయకులు దాడి చేశారు. ముందుగా మాజీ ఎంపీపీ ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ పిలుస్తున్నాడంటూ టీడీపీ కార్యకర్తలు ఫోన్ చేశారు. దీంతో విధులు ముగించుకుని సాయంత్రం ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ ఇంటికి వెళ్లాడు. ఆయనతో మాట్లాడుతుండగానే అతని అనుచరులు హరి, మౌలాలి తమ పని చేయవా అంటూ దుర్భాషలాడుతూ దాడి చేశారంటూ వీఆర్‌ఓ ప్రసాద్ వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరి, మౌలాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

## ఏపీ బెస్త సంక్షేమం అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాజీనామా

**కర్నూలు (టౌన్) :** ఏపీ బెస్త సంక్షేమం అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ తెలుగు సుధారాణి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో మూడున్నర సంవత్సరాల పాటు బెస్త కులాల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమకు వ్యతిరేక ఫలితాలు రావడంతో పదవికి రాజీనామా చేసినట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏపీఐడీసీ డైరెక్టర్ పాటిల్ హనుమంతరెడ్డి సైతం తన పదవికి రాజీనామ చేశారు.

# మూగజీవాలకు 'సీజనల్' ముప్పు!



గొర్రెకు టీకా వేస్తున్న పశు వైద్య సిబ్బంది(ఫైల్)



ఎద్దుకు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

- తొలకరిలో వ్యాధులు విజృంభించే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణనష్టమే
- పశుపోషకులతోపాటు గొర్రె, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

**కల్లూరు:** మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచివుంది. ప్రత్యేకించి వర్షాకాలంలో పాడి పశువులతోపాటు ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలు సీజనల్ వ్యాధులు సోకి అనారోగ్యానికి గురవుతుంటాయి. తొలకరిలో వ్యాపించే దొమ్మరోగం, జబ్బవాపు వ్యాధి, చిటుక వ్యాధి, గొంతు వాపు వ్యాధి తదితర వ్యాధులతో మూగజీవాలు విలవిలలాడుతుంటాయి. పశుపోషకులు...గొర్రె, మేకల పెంపకందారులు ఏ మా త్రం నిర్లక్ష్యం వహించినా మూగజీవాలు ప్రాణాలు కోల్పేయే ప్రమాదం ఉంది. సాధారణంగా తొలకరి వర్షాలకు పొలాలు, కొండలు, గుట్టలు, బీడు భూ ముల్లో మొలక గడ్డి పెరుగుతుంది. ఈ గడ్డి చాలా ప్రమాదకరం. అలాగే చెరువులు, కాలువలు, కుంటలలో కొత్తనీరు చేరుతుంది. ఈ పరిస్థితులలో అపరిశుభ్రత, వాతావరణ మార్పుల మూలంగా వివిధ వ్యాధులు పశువులకు సంక్రమిస్తుంటాయి. తొలకరి పచ్చికను మేసిన పశువులు, ప్రత్యేకించి గెర్రెలు, మేకలు ఒకేసారి పెద్దసంఖ్యలో మృతి చెందిన సంఘటనలు చూస్తూనే ఉంటాం. సీజనల్ వ్యాధులపై పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి సూచిస్తున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన జీవాల ప్రాణనష్టం జరిగి యజమానులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మూగజీవాల ఆరోగ్యం పరిస్థితిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఏ మాత్రం అనుమానం వచ్చినా పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. కొన్ని వ్యాధులు, నివారణ చర్యలను పశువైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

☛ **జబ్బవాపు వ్యాధి:** క్లాస్ట్రీడియం చోవై అనే బ్యాక్టీరియా మూలంగా ఆవులు, గెదెలు, గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి వస్తుంది. జబ్బ వ్యాధి సోకిన పశువుల కండరాలు వాచిపోయి ఉంటాయి. ఆ కండరాలను చేతితో తాకితే గాలి బుడగల శబ్దం వినిస్తుంది. పశువులకు, జీవాలకు బీక్యూ టీకాలు వేయిస్తే వ్యాధి రాకుండా అరికట్టవచ్చు.

☛ **చిటుక వ్యాధి:** చిటుక వ్యాధి సాధారణంగా గొర్రెలు, మేకలలో వస్తుంది. క్లాస్ట్రీడియం పేరపిరిన్‌జెన్స్ అనే బాక్టీరియా మూలంగా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలు చాలా స్వల్ప సమయం... అంటే చిటుక వేసే సమయంలో చనిపోయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధి రాకుండా సకాలంలో టీకాలు వేయించాలి.

☛ **గొంతు వాపు వ్యాధి:** పాశ్చురెల్లా మాల్టోసిడా, పాశ్చురెల్లా హిమోలైటిక అనే బాక్టీరియాతో ఈ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా నల్లజాతి పశువులు, గొర్రెలు, ఈ వ్యాధిన బారిపడతాయి. పశువుల్లో, జీవాల్లో గొంతు వాచి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చనిపోతాయి. ముందు జాగ్రత్తగా హెచ్ఎస్ టీకాలు వేయించాలి. వర్షకాలంలో గొర్రెలకు ముందుగా పట్టల నివారణ మందులు తాపించి ముందు జాగ్రత్తగా టీకాలు వేయిస్తే ఈ రోగాల రాకుండా నివారించవచ్చు. గాలికుంటు వ్యాధి, నీలినాలుక వ్యాధి వంటి వైరస్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పశు వైద్యులను సంప్రదించి టీకాలను వేయించాలి.

### దొమ్మరోగం (ఆంత్రాక్స్ )

ఈ వ్యాధి ఆవులు, గెదెలు, జీవాల్లో కనిపిస్తుంది. ఎక్కువగా గొర్రెలు, మేకలలో చూస్తుంటాం. ఈ వ్యాధి సోకిన పశువులలో ముక్కు, పాయువు నుంచి గడ్డకట్టనితారు (నల్లని ) లాంటి రక్తం కారతుంది. బాసిల్లస్ ఆంత్రాక్స్ అనే బ్యాక్టీరియా మూలంగా ఈ వ్యాధి వస్తుంది. అయితే వ్యాధి సోకిన పశువులను, గొర్రెలు, మేకలను మంద నుంచి వేరు చేసి తగిన చికిత్స అందిస్తే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. ఇతర వ్యాధి సోకని పశువులకు, జీవాలకు ముందుగానే టీకాలు వేయించాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంత తవ్వి ఉప్పు, సున్నం నీళ్లచల్లి పూడ్చిపెట్టాలి.

# పేదలపై టీడీపీ దాడులు దారుణం

- బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె రూరల్:** సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపిన పేదలపై టీడీపీ నాయకులు దాడులు చేయడం దారుణమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరికృష్ణ, ఆయన భార్య తిరుపతమ్మపై టీడీపీ నాయకులు దాడి చేశారు. బాధితులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హుటహుటిన వైద్యశాలకు వచ్చి బాధితులను పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే కారణంతోనే పేదలపై టీడీపీనాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. బెలుం శింగవరం గ్రామంలో దాడి జరగక ముందే తాను అక్కడి స్థానిక సీఐకి సమాచారం ఇచ్చానని అయినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల బనగానపల్లెలో అబ్దుల్ అనే మైనార్టీ కార్యకర్తపై దాడి చేశారని, బలరామ్‌రెడ్డి అనే కార్యకర్తపై టీడీపీ వారే దాడులు చేసి మళ్లీ కేసులు పెట్టిన్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పేదలపై టీడీపీ నాయకులు చేస్తున్న దాడులను నివారించాల్సింది పోయి, ప్రోత్సహించే విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పే అవకాశం ఉందన్నారు. తీవ్రంగా గాయపడిన హరికృష్ణ, అతని భార్య తిరుపతమ్మ ప్రాణాలకు ఎలాంటి హాని జరిగినా పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా పోలీసు అధికారులు వెంటనే నిందితులను అరెస్టు చేసి, హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాటసాని రామిరెడ్డి వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల అధ్యక్షులు కాటసాని తిరుపాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా



బుట్టా రేణుకను కలిసిన జామియా మసీదు కమిటీ పెద్దలు

**ఎమ్మిగనూరుటౌన్:** స్థానికంగా ఉండి పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమెను పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల పార్టీ శ్రేణులు, స్థానిక జామియా మసీదు కమిటీ పెద్దలు కలిసి మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి గల కారణం, పోలైన ఓట్లు తదితర అంశాలపై వారితో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రజలు తనకు అధిక సంఖ్యలో ఓటు వేశారని అయినప్పటికీ స్వల్ప మెజారిటీతో ఓడిపోవడం బాధాకరమన్నారు. తన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేశారని అయితే ప్రజా తీర్పును గౌరవించాలని, గెలుపోటములు సహజమన్నారు. ఓటమితో ఎవరూ నిరుత్సాహపడవద్దని సూచించారు. మళ్లీ అవకాశం వస్తుందని అప్పుడు విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని చెప్పారు. జగనన్న ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ స్థానికంగానే ఉంటానని పార్టీ శ్రేణులకు తెలిపారు.తనకు ఓట్లు వేసిన ప్రజలకు, అందుకు కష్టపడిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. బుట్టా ప్రతుల్ పాల్గొన్నారు.

## ఘనంగా సిద్ధప్ప తాత జాతర

**కౌతాళం:** మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన మహాయోగి సిద్ధప్ప తాత జాతర శనివారం కనుల పండుగగా జరిగింది. తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాక కర్ణాటక నుంచి వేలాది భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పరవీధుల గుండా రథోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య ఘనంగా చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.